## క్లుప్తంగా

### బాధ్యతతో విధులు నిర్వర్తించాలి



సేవలపై సచివాలయ సిబ్బందిని ఆరాతీస్తున్న ఎంపీడీఓ పట్నాయక్

**వేపాడ:** సచివాలయ సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓ బి.ఎస్.ఎస్.కె.పట్నాయక్ సూచించారు. పాటూరు గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. సిబ్బంది హాజరు, ఇతర రికార్డులను పరిశీలించి, ఈ-సర్వీసులపై సచివాలయ సిబ్బందిని ఆరా తీశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, అర్హులందరికీ పథకాలు అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు.

### 1,791 క్వింటాళ్ల వరి విత్తనాలకు ప్రతిపాదనలు

**వేపాడ:** ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండల రైతులకు రాయితీపై పంపిణీ చేసేందుకు 1,791 క్వింటాళ్ల వరి విత్తనాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించా మని ఏఓ సి.బి.యశ్వంతరావు తెలిపారు. దబ్బిరాజుపేట రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే)లో రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1,791 క్వింటాళ్ల వరివిత్తనాల కోసం ప్రతిపాదనలు చేయగా 1,434 క్వింటాళ్లకు అలాట్‌మెంట్ వచ్చిందన్నారు. ఎంటీయూ-1121 రకం 1,130 క్వింటాళ్లు, బీపీటీ- 5,204 రకం 85 క్వింటాళ్లు, బీపీటీ-3291 రకం 19 క్వింటాళ్లు, ఎంటీయూ-7029 రకం 200 క్వింటాళ్లకు అలాట్‌మెంట్ అయిందని చెప్పారు. రైతులు తమకు ఏ రకం విత్తనాలు కావాలో వివరాలతో ఆర్బీకేల్లో ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్‌తో నమోదు చేసుకోవాలని సూచించారు.

### ఘనంగా ఆలయ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

**దత్తిరాజేరు:** మండలంలోని ఇంగిలాపల్లి గ్రామం బ్రాహ్మణ వీధిలో లక్ష్మీగణపతి స్వామి వారి ఆలయ ప్రతిష్ఠను స్థానికుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిపించారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, స్థానిక నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ మహదేవ్ ఫణీంద్రుడు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు గర్భాపు శ్రీను పూజల్లో పాల్గొన్నారు.

### ప్రజల ముంగిటకే సేవలు



బోనంగిలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ హైమావతి

**గంట్యాడ:** ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి నెలకొల్పిన గ్రామ వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా పథకాలు, ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకే అందుతున్నాయని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బోనంగి, వసాది గ్రామాల్లో బుధవారం వలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఎంపీడీఓ భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

### మెరుగైన వైద్య సేవలందించాలి



వైద్య సేవలపై సిబ్బందిని ఆరా తీస్తున్న డీఎంహెచ్ఎం భాస్కరరావు

**గుర్ల:** 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్య సిబ్బందిని డీఎంహెచ్ఓ భాస్కరరావు ఆదేశించారు. మండలంలోని కోటగండ్రేడులో గుర్ల పీహెచ్‌సీ వైద్యాధి కారి షర్మిళ ఆధ్వర్యంలో బుధవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శిబిరం ఏర్పాటు చేసి ఓపీ(అవుట్ పేషెంట్) సేవలందించారు. వందమందికి వైద్య సిబ్బంది వివిధ వైద్యపరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని డీఎంహెచ్ఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం గ్రామాల వారీగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

# అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ప్రజాప్రతినిధులు



చీపురుపల్లిరూరల్: చిన్ననడిపల్లిలో ప్రజలకు పథకాలను వివరిస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ శిరీష

**చీపురుపల్లిరూరల్:** రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందజేసి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష అన్నారు. మండలంలోని చిన్ననడిపల్లి గ్రామంలో బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎంపీపీ, జెడ్పీటీసీ ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, పథకాల కోసం ఎవరికైనా లంచం ఇచ్చారా అని ప్రజలను ఆరా తీశారు. పథకాల కోసం ఎవరికీ రూపాయి లంచం ఇవ్వలేదని, పారదర్శకంగా పథకాలు అందుతున్నాయని ప్రజలు బదులిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందించేందుకు సీఎం జగన్ గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా నవరత్న పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. స్థానిక సర్పంచ్ గడి సత్యవతి, ఎంపీటీసీ రేగాన ఆదినారాయణ, ఎంపీడీఓ కె.రామకష్ణ రాజు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం,వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, స్థానిక నాయకులు గడి రామునాయుడు,గడి మోహన్ రావు, పలుశాఖల అధికారులు,సచివాలయ సిబ్బంది,వలంటీర్లు పాల్గొన్నారు.



గుర్ల: పథకాలు అందుతున్నాయా లేదా అని వృద్ధురాలిని ఆరా తీస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

**అర్హతే ప్రామాణికం**

**గుర్ల:** పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణ రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని పెనుబర్తిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం రెండో రోజు బుధవారం కొనసాగింది.

ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పేదలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని అన్నారు. నాయకులు బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు , అంబల చిన్నారావు, అచ్యుత్, పరమేష్ పాల్గొన్నారు.

# కౌలు గుర్తింపు కార్డులతో అనేక ప్రయోజనాలు

- వ్యవసాయశాఖ జేడీఏ రామారావు



కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న జేడీఏ రామారావు

**బొండపల్లి:** కౌలు రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న సీసీఆర్‌సీ (క్రాప్ కల్టివేటెడ్ రైట్ కార్డు)లతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ వి.టి.రామారావు అన్నారు. మండలంలోని గరుడుబిల్లి రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే)లో కౌలు రైతులకు బుధవారం గుర్తింపు కార్డు లు (సీసీఆర్‌సీ)తో పాటు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గ్రామాల్లోనే సాగు సంబంధ సేవలన్నీ అందించేందుకు ప్రభుత్వం ఆర్బీకేలను ఏర్పాటు చేసిందన్నారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అర్హత ఉన్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్డుల వల్ల కౌలు రైతులకు అసలు భూయజమానులు వలే అన్ని ప్రయోజనాలను ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. అన్ని ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచామని, కావాల్సిన రైతులు తమ వివరాలను ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. ఏఓ పి.వి.మల్లికార్జున రావు, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొద్దల చిన్నంనాయుడు, లెంక రమణ, ఏఈఓ సంతోష్ కుమార్, వీఏఏలు, వీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

# వేతనదారుల హాజరు పెంచండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

**బొండపల్లి:** గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు వేతనదారుల హాజరు పెంచడానికి క్షేత్ర సహాయకులు కృషి చేయాలని ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ ఆదేశించారు. స్థానిక ఉపాధి హామీపథకం కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల క్షేత్ర సహాయ కులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎండల తీవ్రత కారణంగా ప్రస్తుతం పనులకు హాజరయ్యే వేతనదారుల సంఖ్య తగ్గిందని అన్నారు. ఉదయం ఆరు గంటలకే పని ప్రారంభించి 10 గంటల లోపు పనులను ముగించేలా చూడాలని, వేతనదారులకు అవగాహన కల్పించి హాజరు పెంచేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గజపతినగరం క్లస్టర్ ఉపాధి హామీ ఏపీడీ ఈ.జనార్దనరావు, ఏపీఓ బి.కృష్ణవేణి, ఈసీ సన్యాసిరావు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

# విత్తనాలు, ఎరువులు సిద్ధం



పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ కిరణ్‌కుమార్

**జామి:** ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు సరఫరా చేసేందుకు వరి, పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్బీకే) సిద్ధం చేస్తున్నామని ఏఓ కిరణ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్బీకేలో రైతులకు ఖరీఫ్ పంటల సాగుపై బుధవారం అవగాహన కల్పించారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, భూసార పరీక్షల ప్రాముఖ్యత, వాటివల్ల కలిగే ఉపయోగాలను రైతులకు వివరించారు.50 శాతం రాయితీపై పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తోందని, అన్ని ఆర్బీకేల్లో ఈ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మండలానికి ప్రభుత్వం 2,160 క్వింటాళ్ల వరి విత్తనాలను ప్రభుత్వం కేటాయించిందని, విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో సంప్రదించాలని సూచించారు. కౌలు రైతులు అంతా గుర్తింపు కార్డుల కోసం వీఏఏల ద్వారా వీఆర్ఓలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలంలోని 17 ఆర్బీకేల్లో డీఏపీ, యూరియా ముందు జాగ్రత్తగా నిలువ చేశామని చెప్పారు. అనంతరం రైతులకు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు పంపిణీ చేశారు. సర్పంచ్ లక్ష్మి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### రైలు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

**జామి:** రైలు ప్రమాదాల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ ప్రపంచంలో అతి పెద్ద రైల్వే వ్యవస్థలో ఒకటైన భారతీయ రైల్వేలో తరచూ ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయో వివరిస్తూ కాగ్ విడుదల చేసిన రిపోర్టును కేంద్రప్రభుత్వం అర్థం చేసుకుని తగిన చర్యలు చేపట్టాలన్నారు. కాగ్ నివేదిక ప్రకారం 2017 నుంచి 2021 వరకు 1129 రైలు ప్రమాదాలు జరిగాయని, వీటిలో 156 ప్రమాదాలు సరైన సమయానికి మెయింటెనెన్స్ లేకపోవడం వల్లే జరిగాయన్నారు. కేంద్రం రైల్వేశాఖని సేవారంగం నుంచి తప్పించి వ్యాపార రంగంగా మార్చిందని ఆరోపించారు. లోక్‌సత్తా నాయకులు బి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



గజపతినగరం: శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారి సుష్మ



దత్తిరాజేరు : పోరలిలో సేవలందిస్తున్న డాక్టర్ సతీష్

**గజపతినగరం/ దత్తిరాజేరు/ బొండపల్లి:** గజపతినగరం గ్రామ సచివాలయం-2 పరిధి ఎం.వెంకటాపురం, దత్తిరాజేరు మండలంలోని పోరలి, బొండపల్లి మండలంలోని దేవుపల్లి, బి.రాజేరు గ్రామాల్లో బుధవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ఎం.వెంకటాపురంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ, పోరలిలో దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి సతీష్‌కుమార్, దేవుపల్లి, బి.రాజేరులో దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు జె.ఝాన్సీలక్ష్మి, కె.సత్యవతి ఆధ్వర్యంలో ముందుగా శిబిరాలు నిర్వహించి ఓపీ(అవుట్ పేషెంట్) సేవలందించారు. శిబిరాలకు హాజరైన వారికి సిబ్బంది వివిధ వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

అనంతరం గృహసందర్శన చేసి గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య తనిఖీలు చేశారు. ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల చాలా వ్యాధులకు చెక్ చెప్పవచ్చని వైద్యాధికారులు అన్నారు.



బొండపల్లి: బి.రాజేరులో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యాధికారి సత్యవతి, సిబ్బంది

# ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభం



పాఠాలు బోధిస్తున్న అధ్యాపకుడు మూర్తి

**శృంగవరపుకోట:** ధర్మవరం ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. హెచ్ఎం బి.లక్ష్మి మాట్లాడుతూ హైస్కూల్‌లో గత సంవత్సరం బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు అయిందని చెప్పారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించామని తెలిపారు. బాల్య వివాహాలను నిరోధించడం కోసం, బాలికా అక్షరాస్యతను పెంచడం కోసం, బాలికల డ్రాప్ అవుట్‌లను నివారించడం కోసం ఉమ్మడి విజయనగరం జిల్లాకు ఒక బాలికల జూనియర్ కళాశాల మంజూరుకాగా, దాన్ని ధర్మవరం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారన్నారు. ఈ సంవత్సరం హైస్కూల్, కళాశాల కోసం ఆరుగురు పీజీటీ అధ్యాపకులను ప్రభుత్వం నియమించిందని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, పీజీటీ అధ్యాపకులు కలిసి వివిధ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి, అమ్మాయిలు తల్లిదండ్రులను కలిసి హైస్కూల్, కళాశాలలో తమ అమ్మాయిలను చేర్పించాలని ప్రచారం చేశారని వివరించారు.

### నవధాన్యాలతో నేల సారవంతం

**రాజాం సిటీ:** నవధాన్యాల సాగుతో పంటకు కావాల్సిన పోషకాలు పుష్కలంగా లభిస్తాయని వ్యవసాయాధికారి ఎం.రేణుకాసాయి అన్నారు. మండలంలోని కంచరాం ఆర్బీకే వద్ద బుధవారం రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నవధాన్యాలతో భూసారం పెరగుతుందని, పంటకు కావాల్సిన సూక్ష్మ, స్థూల పోషకాలు పుష్కలంగా అందుతాయన్నారు. ఫలితంగా పంట దిగుబడి పెరుగుతుందన్నారు. ఎకరాకు 13 కిలోల విత్తనాలు అవసరమవుతాయన్నారు.

# గోడ నిర్మాణంతో రైతులకు ఇబ్బంది

**డెంకాడ:** మండలంలోని డెంకాడ - పినతాడివాడగ గ్రామాల మధ్యలో సాగునీటి కాలువలో అడ్డంగా ఎస్యూర్ రియల్ ఎస్టేట్ వారు అక్రమంగా నిర్మిస్తున్న గోడ వల్ల రైతులకు అన్యాయం జరుగుతుందని గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధులు, రైతులు అన్నారు. ఈ గెడ్డ ద్వారా ఏరాక్య, నేరాదు చెరువులకు ఎగువ ప్రాంతం నుంచి నీరు వస్తుందన్నారు. అటువంటి గెడ్డలో అడ్డంగా గోడ నిర్మిస్తే సాగునీటి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అలాగే పినతాడివాడ జగనన్న కాలనీ ముంపు బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గెడ్డలో జరుగుతున్న నిర్మాణ పనులను రైతులతో కలిసి డెంకాడ పీఏసీఎస్ చైర్మన్ రొంగలి కనకసింహాచలం, తదితరులు బుధవారం పరిశీలించారు.

# కల్వర్టు నిర్మించాలని రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు

**గంట్యాడ:** గ్రీన్ ఫీల్డ్ హైవే (హరిత రహదారి)లో భాగంగా రోడ్డు నిర్మాణం వల్ల పంట పొలాలు ముంపునకు గురవుతున్న నేపథ్యంలో కల్వర్టు నిర్మించాలని డిమాండ్ చేస్తూ పెంట శ్రీరాంపురం గ్రామ రైతులు గ్రామంలో బుధవారం ధర్నా చేశారు. రైతులు మాట్లాడుతూ వసంత, పెంటశ్రీరాంపురం గ్రామాలను ఆనుకుని నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవేలో కల్వర్టు ఏర్పాటు చేయకుండా రోడ్డు వేయడం వల్ల పెంట శ్రీరాంపురంలో 50 ఎకరాల పొలం ముంపునకు గురవుతోందని వివరించారు. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించి తమ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరారు. రైతులు కరక మహేష్, బి.రామకృష్ణ, కరక కృష్ణ, లగుడు, సత్యవతి, కరక వెంకటరావు, గుల్లిపల్లి రాము, కరక సూరమ్మ, ఆకిరి రమణరావు, గులిపల్లి రామునాయుడు, బండారు గౌరమ్మ పాల్గొన్నారు.

### సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ఎంపీపీ ప్రమీల

**గుర్ల:** మండలంలోని పాలవలస గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఎంపీపీ పొట్నూరు ప్రమీల బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని, ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలదేనని అన్నారు.

# విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోవాలి

**డెంకాడ:** రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ విజయనగరం ఏడీఏ నాగభూషణం అన్నారు. మండలంలోని చొల్లంగిపేట ఆర్బీకేలో వ్యవసాయశాఖ ద్వారా అందిస్తున్న సేవలపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులకు అవసరమైన ఎరువులను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచామన్నారు. నేలసారం తెలుసుకునేందుకు మట్టి ననమూనాలను సేకరించి వాటి ఫలితాలను రైతులకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఆర్బీకేల ద్వారా ఎరువులు, పురుగు మందుల సరఫరా, పొలంబడిలో భాగంగా పంటల సాగుపై రైతులకు అవగాహన కలిప్తున్నట్లు చెప్పారు. అలాగే వైఎస్సార్ యంత్రసేవ ద్వారా యంత్రాలను రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ విత్తనోత్పత్తి పథకం ద్వారా రైతులకు విత్తనాల తయారీపై తగిన సహాయ, సహకారాలు అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరాడ కనకరాజు, ఏఓ పూడి నిర్మల, ఏఈవో ప్రశాంతి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

### పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రోత్సాహం



గొర్రెలకు నట్టల నివారణ మందుల పంపిణీ ప్రారంభిస్తున్న సర్పంచ్ రామునాయుడు

**వేపాడ:** పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని చినగుడిపాల సర్పంచ్ బోజంకి రామునాయుడు అన్నారు. చినగుడిపాల గ్రామంలో వేపాడ పశువైద్యకేంద్రం వైద్యాధికారి సింహాచలం, గోపాలమిత్ర సింహాద్రప్పడు నేతృత్వంలో జీవాలకు బుధవారం నట్టల నివారణ మందులు వేశారు. ఈ మందుల పంపిణీని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, పశువులు, జీవాలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా ముందుగానే ఉచితంగా మందులు, టీకాలు వేయిస్తోందని చెప్పారు.

### ఈదురు గాలులతో వర్షం



గజపతినగరంలో కురుస్తున్న వర్షం

**గజపతినగరం/ వేపాడ:** గజపతినగరం, వేపాడ మండలాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో ఓ మోస్తారు వర్షం కురిసింది. వేపాడ-ఆనందపురం రహదారిలో తాటి చెట్లు విరిగి పడటంతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.